క్లుప్తంగా

పెళ్లికి ఆర్థికసాయం



నర్మెట: మండలకేంద్రానికి చెందిన నిరుపేద దంపతులు పల్లె రాములు–ఎల్లమ్మ తమ కూతురు అశ్విని వివాహం అనిల్‌తో నిర్వహించారు. కాగా, గురువారం అంబేడ్కర్ యూత్ రూ.18 వేల 632, వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పుస్తె, మట్టెలు, రైసింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఎయిర్ కూలర్, డాక్టర్ పగిడిపాటి రాజు క్వింట బియ్యం, కొలెపాక ప్రశాంత్ 20 కిలోల చికెన్, చింతకింది సురేష్ రూ. 3 వేలు, పులి సురేష్ రూ.3 వేల సాయం అందించడంతోపాటు పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తమ కూతురు వివాహానికి హాజరై ఆర్థికసాయం అందించిన దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య ఖర్చులకు..



తరిగొప్పుల: అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన రేయిన్‌బో యూత్ అసోసియేషన్ సభ్యుడు పాకనాటి రాజేందర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా, బాధితుడిని యూత్ అధ్యక్షుడు బోగం అనూప్ గురువారం పరామర్శించి వైద్యఖర్చుల నిమిత్తం రూ.15వేల సాయం అందజేశారు. మంచినీళ్ల రాజ్‌కుమార్, ఎం. హరిప్రసాద్, అంకం రాజు, జొన్నగోని రవీందర్, గోరంతల రాజేంద్రప్రసాద్, అక్తర్, బండ రాజు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి..




బచ్చన్నపేట: లింగంపల్లి గ్రామానికి చెందిన పసుల సరస్వతి మృతి చెందింది. కాగా, అంత్యక్రియల నిమిత్తం గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పంపిన రూ. 5వేలు, మద్దికుంట రాధ రూ. 2 వేలు, మద్దికుంట రాజిరెడ్డి రూ. 2వేల సాయం బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ సర్పంచ్ మల్లేశం తదితరులు ఉన్నారు.

చేయూత



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామానికి చెందిన నిరుపేద మారెడుపాక వేణు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి స్నేహితులు, గ్రామస్తులు చేయూతను అందించి అండగా నిలిచారు. మాజీ ఉపసర్పంచ్ పొన్న రజిత రాజేష్, యువత సత్తు అనిల్, గాండ్ల సతీష్ ఆధ్వర్యంలో వేణు కుటుంబానికి చేయూతను అందించేందుకు ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన పలువురు పెద్దలు, దాతల సహకారంతో రూ.58,200 మృతుడి చిన్న కుమార్తె శ్రీహర్షిణి పేరిట పోస్టాఫీసులో సుకన్య సమృద్ధి ఖాతాలో జమచేశారు. సదరు పోస్టాఫీస్ ఎఫ్‌డీ పుస్తకాన్ని గురువారం గ్రామంలో బాధిత కుటుంబానికి అందించారు. దోమల ప్రభాకర్, పోగుల సుధాకర్, ఇల్లందుల ప్రతాప్, హిమబిందు, మాచర్ల కుమార్, రంగు ఎల్లయ్య, సొన్నాయిల శ్రీనివాస్ ఉన్నారు.

కమిటీ ఎన్నిక



కరుణాకర్, అధ్యక్షుడు

బచ్చన్నపేట: చిన్నరామన్‌చర్ల కురుమ సంఘం యువజన గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు గురువారం మండల అధ్యక్షుడు కర్రె నరేశ్ తెలిపారు. గ్రామ గౌరవ అధ్యక్షుడిగా మల్ల కృష్ణ, అధ్యక్షుడిగా మంత్రి కరుణాకర్, ఉపాధ్యక్షుడిగా గుండ ఉమేష్, ప్రధాన కార్యదర్శిగా జన్నె కర్ణాకర్, కోశాధికారిగా బండ శ్రీకాంత్, ప్రచార, సంయుక్త కార్యదర్శులుగా కొత్త భానుచందర్, అచ్చిన సంపత్, కర్రె మహేష్, జెట్ట శివప్రసాద్, సభ్యులు పోతం మధు, జన్నె రమేష్, బండ రాజేష్, కుండి భాస్కర్ ఎన్నికయ్యారు.

లక్కమారి కాపు సంఘం..

పాలకుర్తి: లక్కమారి కాపు సంఘం మండల అధ్యక్షుడిగా సింగిరెడ్డి సత్తిరెడ్డి ఎన్నికయ్యారు. గురువారం రాష్ట్ర, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో పాలకుర్తిలో సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా అనుముల ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా బక్కం కొమురెల్లి, ఇంద్రారెడ్డి, పొన్నం వెంకన్న, సహాయ కార్యదర్శులుగా ముస్కు కొమురెల్లి, గోనె సోమన్న, గొట్టికుల సోమనాథం, కోశాధికారిగా ముస్కు ఇంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గోనె సత్యనారాయణ, అనుముల సోమమల్లు, ముస్కు అశోక్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుముల నర్సిరెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, కమిటీ సభ్యుడు గోనె మహేదర్ రెడ్డి, గోనె మైసి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పెంతల శేఖర్ రెడ్డి, అనుముల కుమార్ పాల్గొన్నారు.

పెరిగిన మొక్కజొన్న సాగు

- స్వల్పపెట్టుబడులు, తక్కువ నీటి వినియోగం
- అధిక లాభాలు వస్తుండటంతో రైతుల ఆసక్తి



కూనూర్ శివారులో సాగుచేసిన మొక్కజొన్న

జఫర్‌గఢ్: వరుస పంట నష్టాలను చవిచూసిన రైతులు ఈ ఏడాది యాసంగిలోనైనా గట్టెక్కేందుకు ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో స్వల్ప పెట్టుబడులు తక్కువ నీటి వినియోగంతో అధిక లాభాలు పొందేందుకు రైతులు మొక్కజొన్న సాగును ఎంచుకున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలో రబీలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. గత ఏడాది మొక్కజొన్న పంటను మండలంలో 4,200 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది రబీలో 5,150 ఎకరాల్లో సాగు చేసినట్లు సంబంధిత మండల వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. గతేడాదితో పాటు ప్రస్తుతం రైతులు పత్తి, వరి, తదితర పంటలను సాగు చేసి నష్టపోయారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కూడా అనుకున్న సమయానికి వర్షాలు కురియక రైతులు పంట దిగుబడులు సాధించలేకపోయారు. ముఖ్యంగా పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తి పంట కేవలం ఒక్క క్రాఫ్‌తోనే సరిపెట్టుకోవాల్సి రాగా, వరి పంటతో అనుకున్న స్థాయిలో దిగుబడి రాలేరు.

ఆరుతడి పంటలపై దృష్టి

ప్రస్తుతం వ్యవసాయ బోరు బావుల్లో నీటి సమస్య ఎదురయ్యే అవకాశాలు ఉండడంతో ఎక్కువ శాతం మంది రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించారు. అతి తక్కువ పెట్టుబడులు, నీటి వినియోగంతో అధిక లాభాలు పొందేందుకు మొక్కజొన్న సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మార్కెట్‌లో తక్కువ రోజుల్లో ఎక్కువ దిగుబడి వచ్చే వివిధ రకాల సీడ్స్ అందుబాటులోకి రావడం, కేవలం మూడు నెలల్లో పంట చేతికి రానుంది. ఎకరాకు కేవలం రూ.8 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే పెట్టుబడి కానుండడంతో వ్యవసాయ బోరు, బావుల కింద రైతులు మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారు. ఈ పంటకు తెగుళ్ల బెడద కూడా అంతంత మాత్రమే. ఎకరాకు 25 నుంచి 35 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చే అవకాశం ఉండడం వల్ల మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. పైగా మొక్కజొన్న పంటకు ఈసారి మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండడంతో రైతులకు కలిసిరానుంది.

ఎకరంన్నరలో సాగు చేశా..



యాసంగిలో ఎకరంన్నరలో మొక్కజొన్న సాగు చేశా. ఈ సారి పత్తి పంట సాగుతో తీవ్రంగా నష్టపోయా. నష్టాల నుంచి బయటపడేందుకు తక్కువ పెట్టుబడులతో సాగయ్యే మొక్కజొన్న పంటను వేశా. ప్రస్తుతం పంట బాగానే ఉంది.

\- శాస్త్రబోయిన సత్తయ్య, రైతు, కూనూర్

సాగు విస్తీర్ణం పెరిగింది..

మండలంలో గత ఏడాది కంటే ఈ సారి యాసంగిలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. బోరు బావుల కింద రైతులు ఎక్కువగా మొక్కజొన్న పంటను సాగు చేశారు. తక్కువ పెట్టుబడులు, నీటి వినియోగంతో అధిక లాభాలు సాధించే అవకాశం ఉండడంతో రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. ప్రతీ రైతు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి. ముఖ్యంగా అరుతడి పంటల సాగు రైతులకు ఎంతో మేలు చేస్తుంది.

\- కరుణాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జనగామ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం గెలుపే లక్ష్యంగా సన్నాహక సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని క్లస్టర్ ఇన్‌చార్జ్ లు జూకంటి శ్రీ శైలం, నీలయాదగిరి, గుర్రం నాగరాజు, ఎనగందుల కృష్ణ, దండు ఉపేందర్, అరుణ్, బొల్లం ఉదయ్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంతో పాటు మండలంలోని ఎర్రకుంట తండా, యశ్వంతపురం గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సన్నాహక సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించడంలో క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రతి ఊరిలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగరాలి

బచ్చన్నపేట: స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేయాలని క్లస్టర్ ఇన్‌చార్జ్ అన్నారు. గురువారం మండలంలోని బండనాగారం, లక్ష్మాపూర్, పడమటికేశ్వాపూర్, భోనకొల్లూర్‌లో సన్నాహక సమావేశాలను నిర్వహించారు. ఇన్‌చార్జ్‌లు రాజు, మసీరుద్దీన్, విజయ్, దామెర రాజు, నర్సిరెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

జనగామ రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ కన్న పరశురాములు అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ డైమండ్స్, వాసవి క్లబ్ ఆఫ్ లింగాలగణపురం ఆధ్వర్యంలో పట్టణంలోని రాజరాజేశ్వరి డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రంలో క్లబ్ అధ్యక్షుడు గోడిశాల శివరామకృష్ణ, జోన్ చైర్మన్ కలువల భాస్కర్ రెడ్డి, కోఆర్డినేటర్ లయన్ వెంకటనారాయణ గౌడ్, రఘు, కన్నా రాజశేఖర్ రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

‘వాటర్‌మన్‌ను విధుల్లోకి తీసుకోవాలి’



మాట్లాడుతున్న లాజర్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కోమటిగూడెం జీపీలో మల్టీపర్పస్ వర్కర్ వాటర్‌మన్ గాదరి భిక్షపతిని విధుల్లోకి తీసుకోవాలని గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రం లాజర్ కోరారు. బాధితుడు భిక్షపతి, గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన భిక్షపతి 14 సంవత్సరాలుగా కోమటిగూడెం జీపీలో మల్టీపర్పస్ వర్కర్ వాటర్‌మన్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, వాటర్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడన్నారు. కాగా, గ్రామ కార్యదర్శి గత మూడేళ్లగా అతనికి రావాల్సిన వేతనాన్ని మరొకరికి పంచి ఇస్తున్నాడని, అదనంగా మరో వ్యక్తిని నియమించి భిక్షపతి వేతనం రూ.9,500లో మూడేళ్లగా రూ.4,250 ఇచ్చాడని తెలిపారు. అయితే సదరు వేతనం కూడా ఆరు నెలలుగా రావడం లేదని, వేతనం ఇవ్వమని అడిగినందుకు అతడిని కార్యదర్శి సంతోష్ విధుల్లో నుంచి తొలగించాడన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు, డీపీఓకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుని భిక్షపతిని విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్‌ను వివరణ కోరగా భిక్షపతి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో వాటర్‌మన్‌గా ఇష్టారాజ్యంగా వసూళ్లు, అధికారులపై అసభ్య పదజాలంతో మాట్లాడటం, విధుల్లో నిర్లక్ష్యం తదితర కారణాలతో తొలగించానన్నారు. జీపీ కార్మికులు రాజు, శ్యామ్‌ప్రకాష్, విజయ్, ప్రవీణ్ ఉన్నారు.

‘తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలి’

స్టేషన్‌ఘన్‌పూర్: రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బేషరతుగా రెడ్డి సామాజిక వర్గానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని స్టేషన్‌ఘన్‌పూర్ రెడ్డి జేఏసీ చైర్మన్ కొండం రాజారెడ్డి, కార్యదర్శి ఒట్టె రత్నాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ హోదాలో ఉండి ఇష్టారాజ్యంగా రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు గట్ల మల్లారెడ్డి, జూలుకుంట్ల రాజశేఖరరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, రాంచంద్రారెడ్డి, రాంరెడ్డి, దామోదర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి

- ఎంఈఓ వెంకట్‌రెడ్డి

బచ్చన్నపేట: విద్యార్థులు పట్టుదలతో చదివినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల సెకండరీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ పంపించిన స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేసి మాట్లాడారు. స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకోవాలన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

దేవరుప్పుల: విద్యార్థుల భవిష్యత్ జీవితానికి పది ఫలితాలు తొలి మెట్టు అని హెచ్‌ఎం విష్ణు సూచించారు. గురువారం మండలంలోని కోలుకొండ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ సౌజన్యంతో విజయోస్తు గణితం స్మార్ట్ లెర్నింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు వెంకన్న, హరీష్, శంకర్, సునీత, ఇందిరా, ఆంజనేయులు, శ్రీనివాస్, శోభారాణి, కిరణ్ పాల్గొన్నారు.

వేలం ఆదాయం రూ.15 వేలు



చిల్పూరు: చిల్పూరు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగవేలం పాటలో తలనీలాలు పోగుచేసుకునే హక్కునకు రూ. 15,100 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. గురువారం 2025–26 సంవత్సరానికి వేలం పాటలను నిర్వహించగా తలనీలాలు పోగుచేసుకునే హక్కును రూ.15,100కు ఉద్దెమారి బాలరాజు దక్కించుకున్నారని చెప్పారు. ఇక కొబ్బరికాయలు, పూజా సామగ్రి, గండ దీపం నూనె, కొబ్బరి ముక్కల సేకరణకు ఎవరు ముందుకు రాకపోవడంతో ఈనెల 13వ తేదీకి వేలం వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, ధర్మకర్తలు గనగోని రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు చీటూరు విద్యార్థులు



బాలరాజు



సాగర్



దుర్గాప్రసాద్


లింగాలఘణపురం: మండలంలోని చీటూరు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు గురువారం హెచ్‌ఎం నర్సింహులు తెలిపారు. లాంగ్ జంప్‌లో ఐల బాలరాజు, ట్రిఅట్లాస్‌లో సాగర్, 400 మీటర్ల పరుగుపందెంలో కె.దుర్గాప్రసాద్ ఈ నెల 5న జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 18,19 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

హామీలు నెరవేర్చాలి



జఫర్‌గఢ్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య, మండల కార్యదర్శి గుండెబోయిన రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశం వడ్లకొండ సుధాకర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించిందని అన్నారు. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాని డిమాండ్ చేశారు. నాయకులు కాట సుధాకర్, యాతం సమ్మయ్య, నక్క యాకయ్య, రాపర్తి రజిత పాల్గొన్నారు.

వినూత్న పద్ధతిలో బోధించాలి



జఫర్‌గఢ్: వినూత్న పద్ధతిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన చేయాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ రఘునందన్‌రెడ్డి కోరారు. మండల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం కూనూర్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం పద్మ, షారోని, రాంమూర్తి, వెంకటేశ్వర, మహేందర్, పుట్ట స్వామి, సునీత పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

శ్రీనివాస్ మృతి తీరని లోటు

కొడకండ్ల: చిన్న వయస్సులో గుండెపోటుతో రామవరం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు బొమ్మగాని శ్రీనివాస్‌గౌడ్ మృతి చెందడం బాధాకరమని, అతని మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్ అన్నారు. శ్రీనివాస్ మృతి వార్త తెలుసుకున్న ఆయన గురువారం రామవరం గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

9న టాలెంట్ టెస్ట్

జఫర్‌గఢ్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) సంయుక్తంగా ఈ నెల 9వ తేదీన పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు అంచూరి సురేష్, అవోపా నాయకుడు బెలిదె పూర్ణచందర్, రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులకు గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రంతో పాటు బయాలాజికల్ సైన్స్‌లో ఆబ్జెక్టివ్ తరహాలో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెస్టులో గెలుపొందిన వారికి బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో నిర్వహించనున్న టాలెంట్ టెస్ట్‌కు ప్రతీ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు హాజరయ్యేలా హెచ్‌ఎంలు సహకరించాలని వారు కోరారు. డీటీఎఫ్ ఉపాధ్యాయులు వెంకటపతి, వేణు, శ్రీకాంత్, వేణుగోపాల్, సాయికుమార్, బాలప్రతాప్‌రెడ్డి, రాథోడ్, బజ్జూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మంచుప్పుల దళితులకు న్యాయం చేయాలి

పాలకుర్తి టౌన్: మండలంలోని మంచుప్పుల దళితుల భూసమస్యను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని సాధిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ గురువారం ఢిల్లీలో భారత్ జోడో జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మంచుప్పుల దళితుల భూసమస్యకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయ్యం చేసేలా చర్యలు తీసుకుంటామని యోగేంద్రయాదవ్ హామీ ఇచ్చినట్లు సాధిక్ అలీ తెలిపారు.

కాటమయ్య కిట్లు అందరికీ ఇవ్వాలి..

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కిట్లను అందజేయాలని కల్లుగీతా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో కార్మిక సంఘం నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో 10,500 మంది కార్మికులు సభ్యత్వం కలిగి ఉంటే కేవలం 600 మందికి మాత్రమే కిట్లను ఇచ్చారని, మిగతావారికి కూడా ఇవ్వాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నర్మెట: కల్లుగీత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల శాఖ అధ్యక్షుడు గోపగోని యాదగిరి గౌడ్ సభ్యులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మకులు హక్కుల సాధనకోసం సంఘటితంగా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గోపగోని శ్రీధర్, ఉపాధ్యక్షులు జొన్నగాని శ్రీనివాస్, బండపల్లి శంకరయ్య, గొల్లపల్లి మురళి, చిలుపూర్, లింగాల ఘనపూర్ మండలాల అధ్యక్షులు గనగోని రమేష్, బస్వగాని మహేందర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

‘న్యాయం చేయాలి’

స్టేషన్‌ఘన్‌పూర్: కాజీపేటకు చెందిన శ్రీరామ్ సిటీ ఫైనాన్స్‌లో పూర్తి లోన్ చెల్లించినప్పటికీ లోన్ కట్టలేదంటూ మోసం చేస్తున్నారని, ఈవిషయమై పోలీసులు స్పందించి న్యాయం చేయాలని బాధితుడు అజారుద్దీన్ కోరాడు. ఘన్‌పూర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. నియోజకవర్గంలోని వెంకటాపూర్‌కు చెందిన అజారుద్దీన్ కాజీపేట శ్రీరామ్ సిటీ ఫైనాన్స్‌లో రూ.13 లక్షలు ఇంటి నిర్మాణం కోసం రుణం తీసుకున్నాడు. 12 నెలల పాటు నెలకు రూ.40వేల చొప్పున ఈఎంఐ చెల్లించాడు. అయితే అనంతరం డబ్బులు సర్దుబాటు కావడంతో వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద పూర్తి డబ్బులు చెల్లించాడు. అయితే అనంతరం వచ్చిన కొత్త మేనేజర్ లోన్ చెల్లించలేదని, బకాయి ఉన్నావంటూ మోసం చేస్తున్నాడని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పోలీసులు, అధికారులు స్పందించి విచారణ చేపట్టి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్యయే శరణ్యమని వాపోయాడు.

పరామర్శ

జఫర్‌గఢ్: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు అరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల ఉప్పుగల్లులో మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డిలు గురువారం గ్రామానికి చేరుకుని రమేశ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపాన్ని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆకేరు వాగు పరిసర ప్రాంతాల మీదుగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇసుక తరలించిన వ్యక్తులపై కేసు నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా ఎవరు తరలించిన చర్యలు తప్పవనిని ఆయన హెచ్చరించారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు–లక్షల డప్పులు మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తాటికాయల హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ తాటికాయల ఎల్లయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో హెడ్ కానిస్టేబుల్ బొడ్డు భాస్కర్ తన తండ్రి స్మారకార్థం డప్పులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎల్లస్వామి, ఎల్లయ్య, గోలయ్య, తాటికాయల సోమయ్య, సింహాంద్రి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



దేవరుప్పుల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీఆర్‌ఏ తాళ్లపల్లి ఉదయ్‌కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో ఉదయ్‌కుమార్ మృతదేహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.25 వేల సాయం అందజేసి ఓదార్చారు. ఆయన వెంట నరసింహ గౌడ్, రాజు, నవీన్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా పంటల నమోదు

- ఏఓ విజయ్‌రెడ్డి



ఏఈఓకు సూచనలిస్తున్న ఏఓ విజయ్‌రెడ్డి

కొడకండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా పంటల సాగు నమోదును పకడ్బందీగా చేపట్టడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలకేంద్రంలో ఏఈఓ ఆధ్వర్యంలో డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి క్లస్టర్‌లో ఒక గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి ప్రతి సర్వేనంబర్‌కు ఏఈఓలు వెళ్లి రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయాలని, క్షేత్ర స్థాయిలో డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టడం ద్వారా అవసరమైన ఎరువులు, విత్తనాలు సమకూర్చుకొనేందు కోసం ప్రభుత్వానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కొంగ నవ్య పాల్గొన్నారు.

‘హోలియా దాసరిలను ఎస్సీ–సీలో చేర్చడం అన్యాయం’

కొడకండ్ల: ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన హోలియా దాసరి కులాన్ని ఎస్సీ–సీ జాబితాలో చేర్చడం అన్యాయమని, తాము ఏ విధంగా అభివృద్ధి చెందినట్లు గుర్తించారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని హోలియా దాసరి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తెలకలపెల్లి వెంకన్న, ఉపాధ్యక్షుడు పులి ముత్యాలు, ప్రధాన కార్యదర్శి తీరుపెల్లి రమేశ్‌లు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. తమ జనాభా లక్షకు పైగా ఉన్నప్పటికి కేవలం 8,482 మాత్రమే ఉన్నట్లు చూపించడం వాస్తవాలకు విరుద్ధంగా ఉందన్నారు. తమను ఎస్సీ–ఏ గ్రూపులో చేర్చి న్యాయం చేయాలని, లేనిచో మాదిగ, మాల కులాలను మినహాయించి 57 కులాలను ఒక్క చోట చేర్చి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సంయుక్త కార్యదర్శి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పొగాకు ఉత్పత్తులతో పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో గురువారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు కిరాణాషాపులపై దాడి చేసి రూ.56వేల విలువైన నిషేధిత పొగాకు, గుట్కా ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ కె.మధుసూధన్, ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన దాడులలో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మార్వాడి వ్యాపారి గంచి మిశ్రీమాల్ కిరాణాషాపులో రూ.40వేల విలువైన అంబార్, రూ.5వేలు విలువైన ఆర్‌ఆర్, రూ.10వేల జేకే 3320, రూ.1,000 విలువైన అంబర్‌లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా రూ.56వేల విలువైన గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని విక్రయదారుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో స్టేషన్‌ఘన్‌పూర్ సివిల్ ఎస్సై వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.